ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 12.04.2025 సమయం. 1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఈ నెలలో ప్రతి జిల్లాలో రైతు మేళాలు నిర్వహిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు.
2. రాష్ట్ర లోకాయుక్తగా రిటైర్డ్ హైకోర్టు జడ్జి ఎ. రాజశేఖర్ రెడ్డి , రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్‌గా రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితులయ్యారు.
3. యానిమేషన్ లాంటి రంగాల్లో యువ ప్రతిభను గుర్తించేందుకు భారత మీడియా, ఎంటర్టైన్‌మెంట్ అసోసియేషన్ ( MEAI) చేపట్టిన WAVES Anime, Manga Contest ఈరోజు హైదరాబాద్ లో జరగనుంది.
4. రాష్ట్రంలో పలుచోట్ల ఈరోజు , రేపు ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**THUMMALA**

ఈ నెలలో ప్రతి జిల్లాలో రైతు మేళాలు నిర్వహిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరుగుతున్న తెలంగాణ రైతు మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాణ్యమైన విత్తనాలు సాగు చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయని , దీనిపై రైతులకు అవగాహన కల్పించడానికి ప్రతి జిల్లాలో రైతు మేళాలు నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు.

DESK

**LOKAYUKTA & HRC**

రాష్ట్ర లోకాయుక్తగా రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ. రాజశేఖర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప లోకాయుక్తగా బీ.ఎస్. జగ్జీవన్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్‌గా రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితులయ్యారు. మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా శివాడి ప్రవీణ, బి. కిశోర్‌లను ప్రభుత్వం నియమించింది. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్ , లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 5వ తేదీన సచివాలయంలో సమావేశమైన సెలక్షన్ కమిటీ , అభ్యర్థుల జాబితాను పరిశీలించి వీరి పేర్లను ఖరారు చేసింది.

DESK

**HARISH RAO**

ఇటీవల కురిసిన వడగండ్ల వాన వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు , చిన్నకోడూరు మండలాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన రోజు పరిశీలించారు.

PTC, సిద్ధిపేట

**VANA JEEVI RAMAIAH**

కోటికి పైగా మొక్కలు నాటి వనజీవవిగా పేరుగాంచిన సామాజిక కార్యకర్త , దరిపల్లి రామయ్య ఈరోజు తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 85 సంవత్సరాలు. ఖమ్మం జిల్లా, రెడ్డిపల్లి గ్రామం మారెమ్మగుడి సమీపంలో నివసించే రామయ్య గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవల ఖమ్మం ప్రభుత్వ

ఆసుపత్రిలో చేర్పించగా , గుండెపోటుతో ఈ తెల్లవారుజామున మరణించినట్లు వైద్యులు తెలిపారు.

కాగా, రామయ్య తన జీవిత కాలమంతా మొక్కలు నాటి పెంచడంతో పాటు వృక్షో రక్షతి రక్షిత: అంటూ మొక్కల పెంపకాన్ని ప్రచారం చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2017 లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. ఆయన కృషిని గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆరో తరగతి పాఠ్యాంశాల్లో రామయ్య జీవితాన్ని చేర్చింది. రామయ్య నిజమైన భూమిపుత్రుడని, ప్రకృతి పట్ల ఆయన చూపిన నిబద్ధత తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ప్రభావం చూపించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ , మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు తో సహా పలు పార్టీల నాయకులు వనజీవి రామయ్య మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

---MSL, PTC-KHAMMAM, SANGAREDDY**WAVES ANIME AND MANGA**

**హనుమాన్ జయంతి శోభయాత:**

హనుమాన్ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ తెల్లవారురఝాము నుంచే భక్తులు ఆంజనేయస్వామి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాగా హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాల్లో పలు ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య హనుమాన్ జయంతి శోభాయాత్రలు ప్రారంభం అయ్యాయి. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంతరాలూ జరక్కుండా పోలీసులు పలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా జంట నగరాల్లో ఏటా సాంప్రదాయబద్ధంగా జరిగే ప్రధాన శోభాయాత్ర ప్రశాంతంగా ప్రారంభం అయింది. నగరంలో గౌలిగూడ శ్రీ రామమందిరం నుంచి తాడ్‌బండ్ హనుమాన్ మందిరం వరకు 12 కిలో

మీటర్లకు పైగా దూరం ఈ హనుమాన్ శోభాయాత్ర సాగుతుంది. ఈ యాత్రలో పలు ప్రాంతాలనుంచి చిన్న యాత్రలు కూడా కలుస్తాయి. రాత్రి దాదాపు 8 గంటల వరకు కొనసాగుతుంది. శోభాయాత్ర సందర్భంగా పలు ప్రాంతాలలో వాహనాల రాకపోకలపై పోలీసులు ఆంక్షలు విధించారు. పలు చోట్ల రాకపోకలను మళ్ళించారు.

------- MSL

**(WAM) CONTEST:**

యానిమేషన్ లాంటి రంగాల్లో యువ ప్రతిభను గుర్తించేందుకు భారత మీడియా, ఎంటర్టైన్‌మెంట్ అసోసియేషన్ ( MEAI) చేపట్టిన WAVES Anime, Manga Contest ఈరోజు హైదరాబాద్ లో జరగనుంది. యానిమేటెడ్, మంగా, వెబ్టూన్స్, కాస్ప్లే లాంటి రంగాల్లో జాతీయ స్థాయిలో మొదటిసారిగా 11 నగరాల్లో MEAI ఈ పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు హైదరాబాద్ లో తెలంగాణ VFX, యానిమేషన్, గేమింగ్ అసోసియేషన్ ( TVAGA) సంయుక్తంగా ఈ పోటీని నిర్వహిస్తున్నట్లు MEAI కార్యదర్శి అంకుర్ భాసిన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన World Audio Visual Entertainment Summit-WAVES లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలో విజేతలకు వచ్చే నెల ముంబైలో జరిగే WAVES సదస్సులో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

-------MSL

**MLA ON WHEELS**

ప్రజల సమస్యలు తీర్చడంతో పాటు , వారి సమయం వృథా కాకుండా వారి వద్దకే వెళ్లి పరిష్కాష్కరించేందుకు ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అనే ప్రత్యేక కార్యక్రమం ఎల్లుండి ప్రారంభించనున్నట్లు మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

ఈ విషయమై ఎమ్మెల్యే మా ఆకాశవాణి ప్రతినిధి ప్రతినిధి హనుమాండ్ల సంపత్ కుమార్ తో మాట్లాడుతూ....

**(MLA BYTE)**

PTC,KRMNR

**WEATHER UPDATE**

రాష్ట్రంలో పలుచోట్ల ఈరోజు , రేపు ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉమ్మడి ఖమ్మం ,నల్లగొండ, వరంగల్, మహబుబ్ నగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. కాగా , రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో మార్పు ఉండదని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్ ,కరీంనగర్, నిజమాబాద్, మహబుబ్ నగర్ జిల్లాల్లో 44 డిగ్రీల సెల్సియస్ వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

PN

**MULUGU BYTE**

ములుగు జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ములుగు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రేమలత ఆకాశవాణితో మాట్లాడుతూ...

**(BYTE)**

PTC Mulugu Dist

**TET-2025**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష.. టెట్ - 2025 తొలి విడత నోటిఫికేషన్ ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించి, జూన్ నెలలో ఆన్ లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని టెట్ చైర్మన్ ఈవీ నర్సింహా రెడ్డి తెలిపారు.

PN

**SIRICILLA OPEN SCHOOL**

ఈ నెల 20 నుండి నిర్వహించనున్న ఇంటర్ , పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అధికారులను ఆదేశించారు. 995 మంది ఇంటర్ అభ్యర్థుల కోసం 4 పరీక్షా కేంద్రాలు , 264 మంది పదో తరగతి అభ్యర్థుల కోసం ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలియజేశారు.

PTC, SIRICILLA

**IPL-2025**

ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఈ సాయంత్రం హైదరాబాద్ ఉప్పల్ మైదానంలో జరిగే మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు, పంజాబ్ కింగ్స్ జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్ రాత్రి 07:30 గంటలకు ప్రారంభమవుతుంది. మ్యాచ్ నేపథ్యంలో ఈరోజు సాయంత్రం నుంచి ఉప్పల్, హబ్సిగూడ, తార్నాక పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలియజేశారు. లక్నోలో ఈ మధ్యాహ్నం 3.30 గంటల ప్రారంభమయ్యే మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు, గుజరాత్ టైటాన్స్ జట్టుతో తలపడనుంది.

DESK

**RAJEEV YUVASHAKTI**

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువశక్తి పథకం కోసం ఎల్లుండిలోపు దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రెండో శనివారం , ఆదివారం, సోమవారం వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవు దినాలైనప్పటికీ దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు.

పీటీసీ, నల్లగొండ

**సళేశ్వరం**

నాగర్ కర్నూల్ జిల్లా సళేశ్వరం వచ్చే భక్తులు ప్లాస్టిక్ వాడొద్దని ఆ జిల్లా ఫారెస్ట్ అధికారి రోహిత్ గోపిడి సూచించారు. అభయారణ్యాన్ని ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన నేపథ్యంలో సహకరించాలని ఆయన కోరారు.

పీటీసీ, నాగర్ కర్నూల్

**పెట్రోల్, గ్యాస్**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ గ్యాస్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు పెట్రోల్ , గ్యాస్, ఉత్పత్తుల ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు సగానికి సగం తగ్గినప్పటికీ మన దేశంలో ధరలు పెంచడం అన్యాయమన్నారు. పెంచిన ధరలను తక్షణమే ప్రభుత్వం తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

పీటీసీ, మహబుబాబాద్